క్లుప్తంగా

నేడు తాడికొండలో ఆసరా చెక్కుల పంపిణీ

తాడికొండ: వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా డ్వాక్రా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. స్థానిక బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాల ఆవరణలో సాయంత్రం 3 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఫిరంగిపురంలో పల్లెకు పోదాం

ఫిరంగిపురం: మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వి.హరిబాబు పల్లెకు పోదాం చలో అభియాన్ కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో జి.చంద్రశేఖర్, శివారెడ్డి, అంబేడ్కర్, రావూరి నారాయణ, కె.బ్రహ్మయ్య, జి.హరిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుణదలలో మిస్సింగ్ కేసు

తాడేపల్లిరూరల్: విజయవాడ గుణదల పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి మిస్ అయినట్లు వారి బంధువులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సదరు మిస్ అయిన వ్యక్తి ద్విచక్ర వాహనం, చెప్పులు బకింగ్‌హామ్ కెనాల్ ఎక్స్ క్లూయిస్ వద్ద బ్రిడ్జిపై లభించడంతో శనివారం గుణదల పోలీసులు తాడేపల్లికి విచ్చేసి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గుణదలకు చెందిన వి.రామకృష్ణారావు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానించి గజ ఈతగాళ్లతో గాలించగా ఫలితం కనిపించలేదని, ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా వస్తువులు ఇక్కడ వదిలేసి ఎక్కడికైనా వెళ్లాడా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు గుణదల పోలీసులు తెలిపారు.

శరవేగంగా పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



ఫిరంగిపురం: మండలంలోని గ్రామ సచివాలయాలలో ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నవరత్నాలు జగనన్న ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 1,377 మందికి ఇళ్ల స్థలాలు అందజేశారు. కాగా ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. మండంలోని అమీనాబాద్ -1, 2 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 285 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందజేయగా వారిలో 40 మందికి రిజిస్ట్రేషన్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఏకేబాబు తెలిపారు.

నేడు ట్రైన్డ్ నర్సెస్ రాష్ట్ర సదస్సు



గుంటూరు మెడికల్: ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ కె.సుశీల చెప్పారు. శనివారం స్థానిక బ్రాడీపేటలో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్ఎస్‌డీసీ సీఈఓ డాక్టర్ వి. వినోద్‌కుమార్, గౌరవ అతిథులుగా డీఎంఈ డాక్టర్ నరసింహం, ఐఆర్‌సీఎఫ్ చైర్మన్ డాక్టర్ చక్రరావు, యూఎస్ఏకు చెందిన డాక్టర్ ప్రభాకర్ శర్మ, నర్సింగ్ డెప్యూటీ డైరెక్టర్ వల్లి, అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ అజినాత్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. తమ సంఘ సభ్యులకు దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో సైతం నర్సింగ్ అవకాశాలు.. కెరీర్ అభివృద్ధిపై స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా వివరిస్తున్నామని సుశీల చెప్పారు. నర్సింగ్ విత్ అవుట్ బోర్డర్స్, ఎక్స్‌ప్లోరింగ్ గ్లోబల్ ఆపర్చ్యునిటీస్ అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సంగీత మహోత్సవాలు ప్రారంభం

పాత గుంటూరు: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ స్వామి కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో త్యాగబ్రహ్మ 177వ ఆరాధన సంగీత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి నిర్వహణలో రామరాజు ఫౌండేషన్ లక్ష్మీ శ్రీనివాస్ జ్యోతి ప్రకాశనం చేశారు. ఔత్సాహిక కళాకారులు త్యాగరాజ కృతుల్ని గానం చేసి ఆహూతుల్ని అలరించారు. సాయంత్రం సభలో 'త్యాగరాజు విజయం' అనే అంశంపై అతిథులు ప్రసంగించారు. అనంతరం శాస్త్రీయ సంగీత కచేరీలో శ్రీ త్యాగరాజస్వామి కృతుల్ని వీనుల విందుగా గానం చేశారు. కార్యక్రమంలో జి.జానకి, కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, కోశాధికారి ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు. కళాకారులను, అతిథులను సత్కరించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



వేమవరంలో డాక్టర్ వైఎస్సార్, బ్రహ్మారెడ్డి విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని వేమవరం, కండ్రిక, 113 తాళ్లూరు గ్రామాల్లో శనివారం సాయంత్రం ముఖ్యనాయకులు,కార్యకర్తలు, ప్రజలు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వేమవరంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గ్రామమాజీ సర్పంచి పి.బ్రహ్మరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రహ్మంగారి గుడివద్ద పూజలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రజలకుఇచ్చిన అన్ని హామీలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆర్బీకేలు ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందజేశారన్నారు. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణకోసం ప్రతి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌సెంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాడు- నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు చేప్పేలా చేసిన ఘనత జగన్‌కు దక్కుతోందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతుగా ప్రతి ఒక్కరూ కృషి చేసి రానున్న ఎన్నికలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎ.సునీత, పార్టీ అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచి ఎం.శివకుమారి, ఎం.సుధాకరరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, చిట్టా అంజిరెడ్డి, పి.కోటిరెడ్డి, పాలపాటి రఘు, పి.మరియబాబు, డి.మెలిక్కయా, కె.అప్పిరెడ్డి, పి.బ్రహ్మారెడ్డి, డి.నరేంద్రకుమార్, పి.చిన్న, ఎస్.చిన్నప్ప, హేమలతారెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, టి.కృష్ణ, ఇబ్రాయిల్, ఎస్.నాగరాజు, బాజి, ఖాజావలి, జి.మస్తాన్‌వలి, పి.శ్రీనివాసరెడ్డి, పుల్లారావు, సంజీవరెడ్డి, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా మందిరం వార్షికోత్సవం



సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవిలను సత్కరించి స్వామి చిత్రపటాలను బహూకరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడిలో వేంచేసి ఉన్న భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిర 18వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరగా నిర్వాహకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, ఉన్నతాధికారి సిసోడియా, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, ఐలాపురం రాజా, కృష్ణమాచార్య స్వామిజీ దర్శించుకోగా ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం వారిని సత్కరించి స్వామి వారి చిత్రపటాలు బహూకరించారు. అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి, హాస్యవల్లరి, మిమిక్రీ, మ్యాజిక్ షోలు అలరించాయి. రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

13 నుంచి విజయకీలాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి 18 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు అన్నారు. శనివారం చిన్న జీయర్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రారంభిస్తారని తెలిపారు. శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆరు రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధుసూదనాచార్యులు చలసాని ఆంజనేయులు, రఘునాథాచార్యులు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సమతా దీక్షలో భాగంగా విస్తృత ప్రచారం

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సమతా దీక్షను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం సమతా దీక్ష నిర్వహించామని, వేద విద్యార్థులు, అధ్యాపకులు, కోలాట బృందంతో నగర సంకీర్తన నిర్వహించామని తెలిపారు

ఉర్దూ పాఠశాల తనిఖీ

రాయపూడి(తాడికొండ): తుళ్లూరు మండల పరిధిలోని రాయపూడి, పెద్దపరిమి గ్రామాలలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో బోధనా నైపుణ్యాలను పరిశీలించిన ఆయన ఫార్మేటివ్ పరీక్షా పత్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ రాజశేఖర్ ఉన్నారు.

పోలీసులని బెదిరించిన ఇద్దరిపై కేసు

తాడేపల్లిరూరల్: నగరపాలకసంస్థ పరిధిలోని కొలనుకొండ బైపాస్ రోడ్డులో పోలీసుల పేరుతో వాహన చోదకులను బెదిరించి నగదు వసూలు చేస్తున్న ఇద్దరు యువకులను తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి శనివారం కోర్టుకు హాజరు పరిచారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. దుగ్గిరాల మండలం పెదకొండూరు గ్రామానికి చెందిన మంటాడ సీతారామయ్య, మంగళగిరికి చెందిన కొండూరు రమేష్ ఇద్దరూ స్నేహితులు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి సమయంలో రోడ్లపై తిరుగుతూ పోలీసులమని చెప్పి వాహనదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తూ జల్సా చేస్తున్నారు. ఇదే క్రమంలో కొలనుకొండ బైపాస్‌లో లారీ డ్రైవర్లను బెదిరిస్తుండగా విధుల్లో ఉన్న తాడేపల్లి పోలీసులు నైట్‌బీట్‌లో లారీ వారిని బెదిరించడం చూసి వారిని ప్రశ్నించగా మేము పోలీసులమని చెప్పి డబ్బులు అడుగుతున్నాడని లారీ డ్రైవర్ తెలియజేయడంతో వాహనచోదకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి కోర్టు హాజరుపరిచినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

రైల్వే స్థలాల బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ



రైల్వే స్థలాల బాధితులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణంలో సలాం సెంటర్, రామాలయం, రన్నింగ్‌రూమ్, పోతురాజు గడి, ముగ్గురోడ్డు తదితర ప్రాంతాల్లో రైల్వే స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. శనివారం బాధితులతో రూరల్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి, జేసీఎస్ కనీ్వనర్ ఈదులమూడి డేవిడ్ రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా బుర్రముక్కు వేణుగోపాల మాట్లాడుతూ రైల్వేస్థలాల్లో నివసించేవారు ఇక్కడే ఉండే విధంగా రెగ్యులైజేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఇళ్లు కూల్చివేతకు రైల్వే సిబ్బంది వస్తే కలసికట్టుగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు తుడిమెల్ల వెంకటయ్య, కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముదిగొండ ప్రకాష్, మేకా వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ, రోడ్ల సమస్య పరిష్కారం



తాడికొండ శాంతి నగర్‌లో పొక్లెయిన్‌లో డ్రెయిన్ పనులు చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడికొండ: తాడికొండ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చొరవతో తాడికొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న శాంతినగర్‌లో సమస్యలు తీరనున్నాయి. మంగళవారం తాడికొండలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేసేందుకు హాజరైన ఎమ్మెల్యేకు శాంతి నగర్ వాసులు తమ సమస్యలు విన్నవించారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, రోడ్లు సమస్యతోపాటు లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తన సొంత నిధులతో పొక్లెయిన్ తెప్పించి డ్రైనేజీ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. సమస్యను విన్నవించిన 4 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే సుచరిత చొరవతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆనాటి.. ఆ స్నేహ ఆనందగీతం..




గ్రూప్‌గా ఫొటో దిగిన పూర్వ వైద్య విద్యార్థులు

గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1981 ఎంబీబీఎస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో కలుసుకున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో స్థిరపడిన వైద్యులతోపాటు, విదేశాల్లో ఉంటున్న వారు సైతం సుమారు 42 ఏళ్ల తరువాత వైద్య కళాశాలలో కలుసుకుని నాటి జ్ఞాపికాలు నెమరువేసుకున్నారు. గుంటూరు జీజీహెచ్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్‌ను పలువురు వైదులు అభినందించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ పాదిల ప్రసాద్ జీజీహెచ్ అభివృద్ధికి గతంలో రూ. 5 కోట్లు ఇచ్చిన, మళ్లీ నేడు రూ. 2 కోట్లు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, కృష్ణా జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, డాక్టర్ మస్తాన్, డాక్టర్ మొహమ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో 'చలపతి' ప్రతిభ



మోతడక(తాడికొండ): జేఎన్‌టీ యూనివర్సిటీ కాకినాడ పరిధిలో శ్రీ సారధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నూజివీడులో నిర్వహించిన సెంట్రల్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మూడో స్థానం సాధించి బహుమతి అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. ఈ పోటీలకు మొత్తం 18 టీమ్‌లు పాల్గొనగా కళాశాల జట్టుకు మూడో స్థానం లభించడంతో పాటు విద్యార్థి షమీమ్‌ను యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేయడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపాల్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, పీడీ దమ్మాటి రాము ప్రత్యేకంగా అభినందించారు.

చేనేత భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ఎమ్మెల్సీ మురుగుడు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో తుది దశకు చేరుకున్న ప్రగడ కోటయ్య, వైఎస్సార్ చేనేత భవనం నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేసి దుకాణదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి అధికారులకు సూచించారు. శనివారం చేనేత భవనంలో పనులు పరిశీలించారు. నాణ్యతలో రాజీలేకుండా పనులను వేగవంతం చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. పట్టణంలోని చేనేత కార్మికుల కోసం చేనేత మగ్గాల షెడ్లు నిర్మాణం చేయడమే కాక చేనేత వస్త్రాలు మార్కెటింగ్ కొరకు దుకాణ సముదాయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, పార్టీ నాయకులు బేతపూడి నరసయ్య, గూండా మధు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ రైతులకు వ్యతిరేకం

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతాంగ వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకించాలని కోరుతూ శనివారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సుందరయ్య చౌక్‌వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోని బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశ వ్యవసాయ రంగాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టిందన్నారు. గతంలో మూడు వ్యవసాయ నల్ల చట్టాల ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు అప్పజెప్పడానికి ప్రయత్నిస్తే రైతాంగం వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన జరిపిన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కూడా రైతాంగానికి తీవ్రంగా మోసగించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన నిర్వహించబోయే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాజధాని అధ్యక్షులు కె. ఈశ్వర్ రెడ్డి, భక్తిరెడ్డి, కోటేశ్వరరావు, ఈమని రామారావు, గాంధీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

దుగ్గిరాలలో......

దుగ్గిరాల మార్కెట్‌యార్డ్ వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బడ్జెట్ కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, నాయకులు వి.వెంకటరామయ్య, కాజా వెంకటేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు పాల్గొన్నారు.

జార్ఖండ్‌పై ఉత్తరాఖండ్ ఘన విజయం



నందిని కాష్యప్



రాగ్వి బిస్ట్



నీలమ్ బరధ్వాజ్

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో కల అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న బీసీసీఐ అండర్ 23 ఉమెన్ టోర్నమెంట్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టుపై ఉత్తరాఖండ్ జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన జార్ఖండ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 50 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 267 పరుగులు చేసింది. ఉత్తరాఖండ్ బ్యాట్స్ ఉమెన్‌లు రాగ్వి బిస్ట్, నందిని కాష్యప్‌లు 98, 96 పరుగులు చేసి తృటిలో సెంచరీలు మిస్ అయ్యారు. అనంతరం 268 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేయగా ఉత్తరాఖండ్ జట్టు 109 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉత్తరాఖండ్ బౌలర్ నీలమ్ బరధ్వాజ్ 7 ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి రాణించింది.

దళితుడి స్థలం ఆక్రమణ

- దౌర్జన్యానికి పాల్పడుతున్న టీడీపీ నాయకుడు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీసులను ఆశ్రయించిన పూర్ణచంద్రరావు దంపతులు

తాడేపల్లిరూరల్: అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు ఎక్కడ స్థలం కనబడితే దాన్ని ఆక్రమించుకుని ఉన్న స్థలం రేటు కన్నా తక్కువ ధరకు అమ్మి తమ జేబులు నింపుకున్నారు. మళ్లీ ప్రభుత్వం మాదే వస్తుందని, మాకు అడ్డు ఎవరంటూ ఆక్రమణలు చేస్తూ ఓ దళిత దంపతులకు సంబంధించిన ఖాళీ స్థలాన్ని ఆ దళిత టీడీపీ నాయకుడు ఆక్రమించుకుని స్థలంలోకి వస్తే దౌర్జన్యం చేసి కొట్టేందుకు ప్రయత్నించగా శనివారం తాడేపల్లి పోలీసులను ఆ దంపతులు ఆశ్రయించారు. దళిత బాధితుడు కంచర్ల పూర్ణచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం ఉండవల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి 1980– 1985 మధ్య కాలంలో సీపీఎం నాయకులు ప్రకాశం బ్యారేజ్ మంగళగిరి రోడ్ నుంచి ఉండవల్లి దళితవాడలోకి వెళ్లే రహదారిలో ఇళ్ల ప్లాట్లు వేసి పేదవారికి అందజేశారు. అందులో భాగంగా మా తండ్రి అయిన కంచర్ల ప్రకాష్‌కు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఇప్పుడు ఆ స్థలం మాది అని రియల్ ఎస్టేట్ వ్యాపారి, టీడీపీ నాయకుడు దౌర్జన్యం చేస్తున్నాడని, హద్దు రాళ్లను పీకివేశాడని, స్థలంలోకి వస్తే చంపివేస్తామని హెచ్చరించారని, అప్పుడు స్థలం అందజేసిన సీపీఎం నాయకులు జొన్నా శివశంకరరావును ఆశ్రయించగా ఆ స్థలం మీ నాన్నకే కేటాయించామని అన్నారని, మా స్థలానికి ముందు, వెనుక ఇళ్లు నిర్మించుకున్న వారు ఆ స్థలం ప్రకాష్‌కే కేటాయించారని, మా ఇంటి హద్దులలో కూడా అదే పేరు ఉంటుందని చెప్పారని, అదే విషయాన్ని మళ్లీ టీడీపీ నాయకులకు, కుల పెద్దలకు చెప్పగా కులపెద్దలు అందరూ ఆ స్థలం నీదేనని, వారిని ఎదిరించే ధైర్యం మాకు లేదని అంటున్నారని, జరిగిన ఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పోలీసులు విచారించి మా స్థలాన్ని మాకు ఇప్పించాలని పూర్ణచంద్రరావు కోరాడు.

నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు



దుగ్గిరాల మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తాడేపల్లిరూరల్: గత నెల 19వ తేదీన దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. దుగ్గిరాలలోని మార్కెటింగ్ యార్డు వద్ద రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నష్టపోయిన పసుపు రైతులకు వెంటనే ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం క్వింటాకు రూ.11,850 ఇవ్వాలని, అదే విధంగా అద్దెలు, వడ్డీలు, బ్యాంకు రుణాలు రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పసుపు రైతులను ఆదుకోవాలని, మార్కెట్ రేటు ప్రకారం ఇన్సూరెన్స్ ఇప్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో కోల్డ్ స్టోరేజ్ బాధితుల కమిటీ కన్వీనర్ వి. వెంకటరామయ్య, కో కన్వీనర్ కాజా వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, వై. బ్రహ్మేశ్వరరావు, వెంకట అప్పారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జెట్టి బాలరాజు పాల్గొన్నారు.